క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా 200 మంది రోగులు, 100 మంది చిన్నారులకు నేత్ర, దంత, బీసీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఆరుగురు రక్తదానం చేశారు. ఇద్దరు పేదలకు వంటపాత్రలు సరఫరా చేయడం జరిగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి విరాళాలు


అర్చకుడికి విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూసమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి స్వర్ణ కిరీటం నిమిత్తం శనివారం పలువురు విరాళం ఇచ్చినట్లు ఆలయ అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు. వెలువర్తి వెంకటరమణ, ప్రసన్నలత దంపతులు రూ.50 వేలు, సన్యాసి రాఘవరావు, ఇందిర దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు.

పరామర్శ


కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


జి.సిగడాం: మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. దేవరవలస పంచాయతీ మంగమ్మపేట గ్రామానికి చెందిన లంకలపల్లి దాస్ అనారోగ్యంలో బాధపడుతున్నాడు, అలాగే అదే గ్రామానికి చెందిన లంకలపల్లి ఉదయ్‌కుమార్, లంకలపల్లి చంద్ర ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు దోల వెంకటరమణ, ఎంపీటీసీ తిరుమరెడ్డి లక్ష్మణరావు, జనపాల ధనుంజయరావు, యర్రబోలు పకీరు, తూట అప్పలరాజు, ఇనుపకుర్తి అప్పలదాస్, ఇజ్జి సత్యారావు, దేవిశెట్టి రమణ తదితరులు ఉన్నారు.

ప్రయాణికులతో కిటకిట


నాన్‌స్టాప్‌లుగా పల్లె వెలుగు బస్సులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించింది. మే కావడంతో పాటు శనివారం పెళ్లిళ్లు ఎక్కువగా ఉండడంతో బస్సులు కిక్కిరిశాయి. ముఖ్యంగా నాన్‌స్టాప్ కౌంటర్‌లో టికెట్ల కోసం ప్రయాణికులు క్యూలో బారులుతీరుతూ కనిపించారు. నాన్‌స్టాప్ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ అధికారులు త్వరితగతిన స్పందించి నాన్‌స్టాప్ బస్సుల స్థానంలో పల్లె వెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడిపించారు. దీంతో నాన్‌స్టాప్ క్యూల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గింది.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం


బస్సును పరిశీలిస్తున్న మేనేజర్ అమరసింహుడు తదితరులు

శ్రీకాకుళం అర్బన్: ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ సంస్థ అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం ఒకటో డిపోకు చెందిన నాన్‌స్టాప్ బస్‌ను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు 18,000 కిలోమీటర్లు తిరిగిన అనంతరం బస్ ఇంజిన్ విడిభాగాలు, టైర్లు, బ్రేక్‌లు తదితరవి పరీక్షిస్తామన్నారు. ఇవి పక్కాగా ఉన్నాయంటేనే మరలా సర్వీసు బస్సులుగా నడిపిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఇన్‌చార్జి స్వామి, రాజు తదితరులు ఉన్నారు.

ఎండ.. ప్రచండం


దే అండ్ నైట్ కూడలి వద్ద ఎండకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

- సిగ్నల్ పాయింట్స్ వద్ద ప్రయాణికుల అవస్థలు
- షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని విన్నపాలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిఏటా ఏర్పాటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. అసాధారణ ఎండలు ప్రజలను భయపెడుతున్నాయి. ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ సుమారు 35 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఉద్యోగ, ఉపాధి రీత్యా బయటకు రావాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాగే విద్యార్థులు సమ్మర్ క్లాసులకు, పోటీ పరీక్షల కోచింగ్‌లకు, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కోసం కోచింగ్‌లకు ప్రతిరోజూ శ్రీకాకుళం నగరానికి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో, సైకిళ్లతో నగరంలో ప్రయాణిస్తుంటారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు శ్రీకాకుళం నడిబొడ్డున డే అండ్ నైట్ కూడలి, వైఎస్సార్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి, సూర్యమహల్, మిల్లు జంక్షన్‌ల వద్ద సిగ్నల్స్ వేస్తుంటారు. అయితే ప్రస్తుతం మండుతున్న ఎండలకు సిగ్నల్ వేసిన సమయంలో అక్కడ ఉండటానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిగ్నల్ సమయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు షెడ్‌నెట్స్ ఏర్పాటు చేస్తే కొంతవరకు ఎండ నుంచి రక్షణ కలుగుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.


వైఎస్సార్ కూడలి వద్ద ఎండకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో నగర ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. వినూత్నమైన ఆలోచనతో అప్పటి కమిషనర్లకు సూచించి ప్రతి జంక్షన్ వద్ద పచ్చని రంగులో ఉండే షేడ్‌నెట్స్ ఏర్పాటు చేసి ఎండ నుంచి రక్షణ కల్పించారు. కానీ ప్రస్తుతం అధికారులు, నాయకులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో ఇటువంటి ఆలోచన చేయాలి. కానీ కనీసం ప్రజలకు మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యలపై ఇటు కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎండల తీవ్రత తగ్గేందుకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఎండకు తట్టుకోలేక సిగ్నల్స్ సైతం లెక్కచేయకుండా వెళ్లిపోతున్న ప్రయాణికులు

ఎండలు తట్టుకోలేకపోతున్నాం

ఇదివరకు ప్రతిఏటా ప్రధాన కూడళ్లు, సిగ్నల్ పాయింట్స్ వద్ద ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేసేవారు. కానీ మే నెల వచ్చినా ఈ ఏడాది ఇప్పటివరకు అటువంటి చర్యలకు చొరవ చూపలేదు. సిగ్నల్ పాయింట్ వద్ద ఆగితే ఎండను తట్టుకోలేక స్పృహ కోల్పోయే పరిస్థితి ఉంది. తక్షణమే గ్రీన్ షేడ్ నెట్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఎస్.అప్పారావు, ప్రయాణికుడు, శ్రీకాకుళం నగరం

చర్యలు చేపడతాం



ఎండల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని కోరలేదు. ఎండల నుంచి రక్షణ కల్పించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. ఇప్పటికే ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశాం. సిగ్నల్ పాయింట్ల వద్ద సైతం ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, కమిషనర్, నగరపాలక సంస్థ, శ్రీకాకుళం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణంపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జేసీఐ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షుడు కూన అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం జేసీఐ ఆధ్వర్యంలో ప్రయాణికులు, ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని రక్షించుకునేందుకు వీలైనంతవరకు గుడ్డ (జూట్) సంచులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వద్దు, గుడ్డ సంచులు ముద్దు అని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ (జూట్) సంచుల వాడకం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. జేసీఐ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను రహదారికి ఇరువైపులా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన చెత్తకుండీలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ సంస్థ జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే తదితర డిమాండ్లతో ఈనెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల జిల్లాస్థాయి సంయుక్త సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటల మద్దతు ధరల చట్టం చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలన్నారు. 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు కృష్ణవేణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి


ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. శ్రీకాకుళం రెండో డిపో గ్యారేజ్ ఆవరణలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నెలలో అత్యధిక కేఎంపీఎల్ సాధించడంతో ప్రతిభ కనబర్చిన ఇద్దరు డ్రైవర్లు ఎస్.అప్పన్న, ఎస్.లక్ష్మణరావులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్)లో ప్రతిభ కనబర్చిన ఏడుగురు ఉత్తమ కండక్టర్లకు సైతం నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) బి.చాణక్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


జి.సిగడాం: దవళపేటలో అన్నదానం చేస్తున్న భక్తులు


అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హయాతీనగరంలో ఉన్న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు లోకేష్ ఆధ్వర్యంలో అర్చనలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కిల్లాన మాధవరావు, కిల్లాన ఫల్గుణరావు, నల్లాన ప్రసాద్, బాబీ, కిల్లాన భోజ్‌కుమార్, కిల్లాన శ్రీనివాసరావు, ఎ.రామారావు, రాజేశ్వరి, కోరాడ శ్రీను, పైడి సుధాకర్, లాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని దవళపేట గ్రామంలో వెలిసిన తులసీమ్మ పేరంటాల ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

ధర్మారావు సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ రంగానికి దూసి ధర్మారావు చేసిన సేవలు మరువలేనివని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో తరుణి కృష్ణ స్మారక ధార్మిక సేవ ట్రస్టు, రెడ్‌క్రాస్ సంయుక్త నిర్వహణలో దూసి ధర్మారావు వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన రసతరంగిణిలోని పలు అంశాలపై వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో గాయత్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి భమిడిపాడి గౌరీశంకర్, కవి కంచరాన భుజంగరావు, ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, దూసి వెంకట రమణ మూర్తి, ఎంపీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం


ఆధ్యాత్మిక ప్రవచనం చెబుతున్న రామనాథశర్మ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటలో ఉన్న రాజరాజేశ్వరీ లలితా మహా త్రిపుర సుందరీ దేవి పీఠంలో ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రముఖ పురాణ ప్రవచనకర్త మల్లాది వెంకట రామనాథశర్మ 'జగద్గురు ఆదిశంకరులు – ఆమ్నాయ పీఠముల వైభవం' అనే అంశంపై మాట్లాడారు. శంకరాచార్యుల వైభవాన్ని, కరుణా కృప, అనుగ్రహాలను వివరించారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, పెంట వశిష్ట కార్తికేయశర్మ, ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, బారువ కోమలరావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం


అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్:

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్ల రైతుసేవా కేంద్రంలో శనివారం రైతులకు నవధాన్యాలు కిట్లు అందజేసి, సాగు వలన ప్రయోజనాలను వివరించారు. 365 రోజులు పాటు భూమి పంటలతో కప్పి ఉంచే ప్రక్రియలో నవధాన్యాలు సాగు కీలకమని చెప్పారు. వేసవిలో భూమి కప్పి ఉంటుందన్నారు. నవధాన్యాల సాగులో 18 నుంచి 30 రకాల విత్తనాలు సాగు చేయడం జరుగుతుందన్నారు. తీగజాతి, ఆకు కూరలు, ఇతర భూసారం పెంచే విత్తనాలు ఇందులో ఉంటాయన్నారు. నేలలో కర్బన శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పూర్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘాటు తగ్గిన మిరప


ఆరుబయట ఆరబెట్టిన మిరప

- తగ్గిన మిర్చి కొనుగోళ్లు
- సిండికేట్‌గా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఇప్పిలి, కనుగులవానిపేట, కుందువానిపేట పంచాయతీ పరిధిలో సుమారు 200 ఎకరాల్లో మిరప పంటను రైతులు సాగు చేశారు. ఈ పంటను ఈ ఏడాది జనవరిలో వేయగా ఏప్రిల్, మే నెలలో పంట దిగుబడి చేతికి వచ్చింది. అన్నిచోట్ల దిగుబడి బాగున్నప్పటికీ కాయలు కొనేందుకు మాత్రం వ్యాపారులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అన్నిచోట్ల మిరప పంటలు మంచి దిగుబడి సాధించాయని స్థానిక రైతులు అంటున్నారు.

తగ్గిన ధర

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతుకు మిర్చి ధర లాభసాటిగా లేదు. గతంలో కేజీ రూ.150లు పలికితే, ఇప్పుడు రూ.90లకు వ్యాపారులు అడుగుతున్నారు. గతంలో పచ్చికాయ కేజీ రూ.30–40లు పలికితే, ఇప్పుడు రూ.13లకు అడుగుతున్నారు. దీంతో పచ్చిమిర్చి రైతులు పండించిన పంటను అమ్మాలా లేక పారబోయాలా అన్న సందిగ్ధంలో ఉన్నారు.

సిండికేట్‌గా వ్యాపారులు

మిరప పంట అన్నిచోట్ల మంచి దిగుబడులు సాధించినప్పటికీ వ్యాపారులు మాత్రం సిండికేట్‌గా మారిపోయారు. గ్రామాల్లోకి రాకపోకలు సాగిస్తూ మూకుమ్మడిగా సిండికేట్‌గా వెళ్తున్నట్లు తెలుస్తోంది. కేవలం వ్యాపారులు కోట్ చేసిన అతి తక్కువ రేటుకు మాత్రమే ఇవ్వాలంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు వాడాం



గతం కంటే ఈసారి మిరపలో మంచి లాభాలు రావాలని నాణ్యమైన విత్తనాలు వాడడం జరిగింది. 10 గ్రాముల విత్తనాలు రూ.350లకు కొనుగోలు చేశాం. ఆశించిన మేరకు పంట దిగుబడి బాగా వచ్చింది. కానీ పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు.

– బాబు, ఎంపీటీసీ, ఇప్పిలి

సిండికేట్ అయ్యారు



మా ఇప్పిలి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు మిరప పంటే ఆధారం. ప్రతీఏటా ఈ పంటను మేము పండిస్తాం. కానీ పంటల పరిస్థితి బాగున్నప్పుడు మాత్రం వ్యాపారులంతా సిండికేట్ అయ్యి తక్కువ రేట్లుకు కోట్ చేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలే ఆదుకోవాలి.

– ఎస్.అప్పలనాయుడు, రైతు, ఇప్పిలి

ఐక్యతతోనే హక్కుల సాధన


దళిత సంఘాల నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళితులంతా ఐక్యతగా ఉంటే తమ హక్కులు సాధించుకోవడం సులువవుతుందని దళిత సంఘాల నాయకులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోమ్‌లో పలువురు ఇటీవల పదవులు పొందిన దళిత సంఘాల నాయకులు, సివిల్స్‌లో ర్యాంకుల సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, సభాధ్యక్షుడు పోతల దుర్గారావు, వివిధ సంఘాల నాయకులు గంజి ఆర్.ఎజ్రా, అంపోలు ప్రతాప్, నూతులపాటి భరత్భూషణ్, ఆర్జి కోటి, బహుజన ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శీర రమేష్, విశ్రాంత తహసీల్దార్ రామప్పడు, శ్రీకాకుళం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మెట్ట పురుషోత్తంలు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని 59 కులాల దళితులంతా ఒకే వేదిక మీదకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలు దళితులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళిత జర్నలిస్టు పిన్నింటి అప్పన్న, బి.వేణుగోపాల్, కేఎస్ మూర్తి, గంజి ఆర్.ఎజ్రాలను ఉమ్మడి దళిత ఆదివాసీ ఐక్య వేదిక ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో గోవింద్, నందేష్, గుర్రాల చిన్నబాబు, ఖైరి ధనరాజ్, ధర్మాన గణేష్, జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు డి.రామప్పడు తదితరులు పాల్గొన్నారు.